# 26. ఇన్‌డైరెక్ట్ ఎటాక్

ఇది స్వార్థమనండి, ఎవరితోనూ కలవని ఒంటెత్తు లక్షణమనండి. సాధారణంగా ఒకరి జోలికి పోయే స్వభావం కాదు నాది. నేనూ, మా ఆవిడ సీతా, తొమ్మిదేళ్ళ మా అబ్బాయి రవణా, ఎనిమిదేళ్ళ మా అమ్మాయి సాయిలీలా, కట్స్ పోనూ నెలకి చేతికందే మూడువేల అయిదొందల జీతమూ 'ఇంతేనా నీ ప్రపంచం?' అంటే, ఇంకెవరికైనా ఇంకోరకం ఉంటుందా?' అని నా సందేహం.

ఉన్నదాన్ని విస్తృతం చేసుకుందామనుకుంటాను గాని మనది కానిదాన్ని ఆక్రమిద్దామనే దురుద్దేశం నాకు లేదు. దానికో ఉదాహరణ ఇస్తాను. ఈ మహాపట్నంలో మేం ఉన్న రెండున్నర గదులకే ఎనిమిదొందలు అద్దె చెల్లిస్తున్నాము.

పిల్లలు ఎదుగుతున్నారు కదా అని మా గోడలతో కలిసి ఉన్న పక్క ఒకటిన్నర గదులు వాటా ఖాళీ అయితే యజమానిని అడిగాను. 'ఏకంగా వెయ్యి ఇచ్చేస్తాను, ఆ వాటా నాకు ఇప్పించండి' అంటూ, 'మీకే రెండొందలు పెంచుదామని చూస్తున్నాను. పదిహేను వందలు ఇవ్వగలిగితే మాట్లాడండి. అదైనా ఎల్లుండిలోగా చెప్పాలి' అన్నాడతను. నాతో మొహమాటాలు కుదరవని ముందే చెప్పానుగా, అది నా శక్తికి మించినదని ఆ క్షణమే చెప్పేశాను. అతను చెప్పినట్టే రెండ్రోజుల్లోగానే మరెవరో అద్దెకు దిగినట్లున్నారు. చేతి కొచ్చిందేదో జారిపోయినట్టు అనిపించింది. కాని లేనిపోని ఆశలు పెట్టుకుంటే ఏం లాభం? ఎవరికి ఎంత ప్రాప్తమో, అంతే! చెప్పాను కదా నా పనేదో నాదే అనీ, ఒకరితో నాకు కుదరదనీ! ఎవరో ఒకరో అరో శంకరం లాంటి స్నేహితులుంటారు నాకు. వాడెంత వేళాకోళం పట్టించినా నా మంచీ చెడ్డా నా మటుకు నేనై చెప్పుకునే ఏకైక మిత్రుడు వాడొక్కడే. లోకంలో అనేకమంది తారసపడుతూ ఉంటారు. చూసిన ప్రతి మొహాన్నీ గుర్తు పెట్టుకోవడమంటే అదెవరితనం!

"పోనీ నన్నైనా గుర్తుపెట్టుకున్నారు. అదెంత కాదు!" అంటుంది మా ఆవిడ. "మరి అదే కదా నేను చేసిన పొరపాటు!" అని మాత్రం నేను అనను! అలా అనవలసిన అవకాశం ఇవ్వలేదు మరి.

ముప్పై అయిదు వెళ్ళినా పాతికలోపే అన్నట్టుంటాను నేను. ముప్పై రాకపోయినా నలభై దగ్గరపడినట్టు కనిపిస్తుంది మా సీత.

ఎవరికెలా కనిపిస్తేనేం. లైటు తీసేసిన మా బెడ్‌రూం మాత్రం మేమిద్దరం పోటాపోటీలమని అనుకుంటూ ఉండాలిమరి.... అనుభవసారం అలాగే ఘోషించేది. ప్రతి పైసా తూచి తూచి ఖర్చు పెట్టే నేను, పక్కవాటా అద్దెకి కూడా ఎగబడ్డానంటే పిల్లల్నుంచీ ప్రైవసీ ఆశించే కదా!

ఆ వాటా దొరకక పోవడం మాట అలా ఉంచి, అటునుంచే మరో రకం గలాటా పుట్టుకొస్తుందని అప్పట్లో ఊహించుకోలేకపోయాను! రెండో కంటివాడితో చెప్పుకోలేని ఏ చిచ్చురేగినా

పడకగదిలోనే కదా! చూస్తుండగానే అది 'పడకపోయిన గది'గా మారిపోజొచ్చింది. పిచికలా ఉంటుంది గాని జీర్రున చీది ఎరగనంత గొప్ప ఆరోగ్యం మా సీతది. అలాంటిది ఈ మధ్య తరచూ అటు తిరిగి పడుకుంటోందేమిటి! ఓ చెయ్యో కాలో నా మీద వేస్తే కాని నిద్రపట్టని పతివ్రతా తిలకానికి ఉన్నట్టుండి పిల్లల మధ్య నిద్ర చేసే అవస్థ ఏమొచ్చొంది! అంతేనా? వంట కూడా సరిగ్గా కుదరడం లేదీ మధ్య!

పిల్ల వీపు మీద దబ్బూ, దబ్బూ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఉన్నట్టుండి ఏమొచ్చిందట! నేనుండగానే దాసీదాని మీద లేస్తోంది.

పక్కింట్లో దిగిన ఆవిడ ఎత్తుగా, ఎర్రగా, ఏపుగా ఎంతో బావుంటుందని మా శంకరం చెబితే వినడమే గాని నేను ఎగాదిగా చూసింది కూడా లేదే! ఆవిడ నవనవలాడుతున్న లేత వంకాయలా ఉంటే దాని ముచ్చికలా ఉంటాడట వాళ్ళాయన. ఉంటే ఉండు గాక... ఆ వాటాయే దక్కకపోయాక ఆ ఇంట్లో వాళ్ళు ఎలా చస్తే నాకేం, ఎవరి రూపాలు ఎలా ఉంటే నాకేం?

మా ఇద్దర్లో మాత్రం కొట్టొచ్చినట్టు కనపడే తేడా లేదు! స్వంత గొడవతోటే చస్తూంటే ఊరి గొడవ మాకెందుకు. "అందుకే అన్నాను అటూ ఇటూ కాస్త దృష్టి సారించరా నాన్నా!" అని మా శంకరం చెబుతుంటే అదెందుకో నాకు అర్థం కాలేదు.

"అయినా ఇంకొకరి గొడవ పట్టించుకోకుండా బ్రతకడం కుదరదా ఏం?"

"ఎలా కుదురుతుంది? జరిగినన్నాళ్ళు జల్సాగా లాగించావు. ఇప్పుడు పచ్చివెలక్కాయ గొంతుకలో పడింది. చచ్చినట్టు లెంపలేసుకొని తరుణోపాయం వెతుక్కోక తప్పదు. నాకొచ్చి పడింది ఖర్మ!" మరింత మతిపోయినట్టు వాడివేపు చూశాను. మా వాడు ఎంతో కష్టపడి తను సేకరించిన భోగట్టా నా ముందు పరిచాడు.

మా పక్క వాటా జంట పేర్లు నాగలింగం, రాజరత్నమూట. వాళ్ళు మాంచి వ్యాపారస్తులట. మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న వాటా కోసం చూస్తుంటే మా పక్కనున్న చిన్నవాటా కంటపడిందట. దానికే నెలకి అయిదొందల చొప్పున. మా వాటా ఖాళీ చేయించి ఇస్తానని యజమాని పూచీ ఇస్తే.

నా గుండె దడదడలాడింది.

చిన్నదే అయినా ఎన్నో హంగులున్న వాటా మాది. ఏ మాత్రం ప్రాక్టికల్‌గా ఆలోచించినా పెరుగుతున్న ధరలని బట్టి మేము ఇచ్చే ఎనిమిదొందలు తక్కువే. ఆఫీసు దగ్గర, పిల్ల స్కూలు దగ్గర. ఎక్కడికి వెళ్లాలన్నా బస్‌స్టాప్ దగ్గర. ఉన్నపాటున పొమ్మంటే ఎక్కడికి ఎలా పోవాలిట?

నెత్తిన పట్టిన చెమట తుడుచుకుంటూ మా ఫ్రెండు మొహం చూశాను. నవ్వుతున్నాడు దొంగవెధవ! బొత్తిగా రిజర్వుడు కాండిడేటునని ఏదో ఓ రకంగా జోక్ చెయ్యడం వాడికి హాబీ! అదేం కాదు కదా! నిలదీశాను.

'నే విన్నది నూటికి నూరుపాళ్ళూ కరెక్టురా నాన్నా! పక్క వీధిలోనే కదా నేనూ ఉండేది. వాళ్ళతో వచ్చిన రామూతో పరిచయం అయింది. మేమిద్దరం పాలు పిండించుకొనేది ఓ గేదె దగ్గరే.

నేను నీ క్లోజ్‌ఫ్రెండ్‌నని తెలీక అతను ఎన్నో విషయాలు చెప్పాడు. అదీగాక మనిద్దరి ఇళ్ళల్లో అంట్లు తోమే దాసీదాన్నే వాళ్ళూ పెట్టుకున్నారు. దాన్నుంచి మా ఆవిడ సేకరించిన సంగతులు కొన్ని, అన్నీ ఓ చోట చేర్చి చూసుకుంటే, చెప్పకేం, నీ అవస్థ చిక్కుల్లో పడేలాగే ఉంది మరి!"

మా సీతలో కొట్టొచ్చినట్టు కనపడే మార్పుని తట్టుకోలేక చెప్పుకున్నాను. అంతకు మించిన ప్రమాదం ఏదో మీద పడుతోందని వీడు బెదిరిస్తున్నాడు. ఏమైనా నోరు విప్పుదామంటే 'నూతిలో కప్పగాడివి, నీకిలా కావలసిందే' అంటూ దెప్పులు ఒకటీ. ఎలా చావను ఈ శంకరంగాడితో!

"చూడొరే బలభద్రం, ప్రైవేటుగా నీకే సొంతం అనే పోర్షన్లు ఈ అపార్టుమెంట్ రోజుల్లో కుదరవ్. ఇరుగుపొరుగులతో మంచీ చెడూ పంచుకొని కలివిడిగా ఉండి తీరాల్సిందే. ఇన్నాళ్ళూ మీ పక్కవాటాలో ఉండే బ్రహ్మచారిగాడు తనేమో తన లోకమేమో అన్నట్లుండేవాడు గనక నీ ఆటలు చెల్లేయి. ఇప్పుడు వచ్చిన వాళ్ళు మీలాగే సంసారులు. మీకూ మీకూ అడ్డుగోడ ఒకటే, వచ్చీపోయే గుమ్మం ఒకటే. నీరిచ్చే మోటారూ ఒకటే. ఒకర్నొకరు ఓ కంట కనిపెట్టి ఉండడం మంచిది కదా! వాళ్ళిలా అద్దెకి దిగి తాళం వేసుకున్న మొదలు మిమ్మల్నెలాగో ఓలాగ సాగనంపి మీ వాటా ఆక్రమించేద్దామని చూస్తున్నారు. ఈ సంగతి ఆ రామూ గాడి ద్వారా స్పష్టంగా తెలిసింది."

"అలా జరుగుతుందని నువ్వేం కంగారు పడకు. ఇంటాయన గుణశీలన్‌గారు పెద్ద మనిషి"

"పైకం చేతిలో పడేదాకా లోకంలో అందరూ పెద్దమనుషులే."

"అలా కాదు. అద్దె పెంచుతే పెంచుతాడేమో గాని నా మటుకు నేను ఖాళీ చేసేదాకా ఆ పని చెయ్యనని మొదట్లోనే మాట ఇచ్చాడు తెలుసా?"

"ఓరి వెర్రినాన్నా! నీ మటుకు నువ్వే ఖాళీ చేస్తాననే పరిస్థితులే వస్తే?"

వాడేం అంటున్నాడో నాకు తలాతోకా అవలేదు. సన్నిహితుడుకదా అని సీత వైముఖ్యం గురించి చెప్పబోయాను. దానికిదా జవాబు!

"నా నోటితో నేను చెప్పడం కాదు. రెండ్రోజులు ఆఫీసుకి సెలవు పెట్టు. ఆ సంగతి ఇంట్లో తెలియనివ్వకు. ఏదోవిధంగా రహస్యంగా ఇల్లు చేరి మీ ఆవిడకెలాంటి బ్రెయిన్ వాషింగ్ జరుగుతోందో నువ్వే కనిపెట్టు. వస్తా, పనుంది" అంటూ నన్ను మరింత సస్పెన్సులో ముంచి వాడు చెక్కేశాడు.

అసలే చిన్న వాటా. అలాంటి చోట ఎప్పుడూ లేంది ఇంటావిడ మీద నిఘా కుదిరేనా!

పొద్దుట స్కూలుకెళ్ళిన పిల్లగాళ్ళు సాయంకాలానికి గాని ఇల్లు చేరని మాట నిజమే. రెండు వాటాలకీ గుమ్మం కూడా ఒకటే కదా.

అయినా అవసరం అనేది నా చేత జీవితంలో ఎరగని గూఢచారి పని చేయించింది. నా ఖర్మం కాలి దాసీ మనిషి పైడితల్లి సహాయం తీసుకోవలసి వచ్చింది. ఏడాది పైగా పనిచేస్తోంది గాని అదింతటి మేధావి అని పొరపాటున కూడా అనుకోలేదు! ఏమైతేనేం అసలు విషయం రాబట్టేను.

నేనూ గుమ్మం దిగనిచ్చి రాజరత్నం మా ఇంటికొచ్చేస్తుంది.

"నిన్న రాత్రి మీ మరిది ఈ కొత్తగాజులు తీసుకొచ్చేరు. ఎలా ఉన్నాయంటారు? ప్రతీ శుక్రవారమూ ఓ కొత్త కంచిపట్టు చీర కట్టుకుంటే గాని ఒప్పుకోరు. ఉన్నవి చాలవటండీ, దమ్మిడీ అంత కొంపలో ఇవన్నీ ఎక్కడ పెట్టుకుంటాం అంటే వినరు" అంటూ మొదలెడుతుంది.

'అందరు ఆడాళ్ళలాంటిదే తన ఆవిడా' అనుకోవడమే కాబోలు ఏ మగాడైనా చేసే పొరపాటు! ఇన్నేళ్ళూ నిక్షేపంలా ఉండేది. ఉన్నంతలో తృప్తిపడి మాకందరికీ సుఖశాంతులు ప్రసాదించేది. అన్నీ తెలిసిన సీతలాంటి మధ్య తరగతి మహిళ మనస్సులోనే ఇన్ని తీరని కోర్కెలున్నాయా! ఇన్నేళ్ళపాటు ఇంతటి అసంతృప్తిని దాచుకునే కులాసాగా ఉండగలిగిందా! ఇంకొకరితో పోల్చుకొని కృంగిపోని ఆడదంటూ ఉండదా! అదైనా కొత్తగా ఒకరు వేలెత్తి చూపిస్తే గాని తెలీదా! చుట్టు జరీపట్టు చీరకి కట్టుబడకపోతే, కళ్ళు చెదిరే బంగారు నగకి ఒళ్ళు విడిపోకపోతే అది ఆడప్రాణి కానే కాదా!

మీద పడిన అగ్గిరవ్వని అనుకోవడం దేనికీ, దులుపుకొని నిలదొక్కుకోలేక ఆహ్వానించి ఆహుతైపోతున్న పూరిపాకని అనుకోవాలి. అసలు విషయం అర్థమైన సాయంకాలమే శంకరాన్ని కలిశాను.

"ఏం బలభద్రం, విషయం పోల్చుకున్నావా?"

"ఏమో బాబూ, నా మటుకేదో నా బతుకు బతికెయ్యడమే గాని ఇలాంటి చెద ఇంటికే పడుతుందనుకోలేదు. వాళ్ళకేం లేదాపోదా, ఊరి చివర పెద్ద బంగళా ఉందని చెబుతున్నావ్... నా కొంపకి నిప్పెట్టడానికి కాకపోతే ఈ గోచీకొంపలో అఘోరించడం దేనికి!"

"వాళ్ళ హోల్‌సేల్ షాపుకి దగ్గర కదా! మెయిన్ రోడ్డుని ఆనుకొని ఉందని తీసుకున్నట్టున్నారు."

"ఏడవలేకపోయారు, పిచిక మీదా బ్రహ్మాస్త్రం! ఆడాళ్ళని పంపించి విషబీజాలు నాటించి, నాకే ఎసరు పెడదామనుకున్నాడా ఆ నాగలింగంగాడు! లక్షలుంటే ఉండొచ్చు... అసూయా ద్వేషాలు రేపి పచ్చనికాపురంలో చిచ్చుపెట్టే సంస్కృతా వాడిది! దీనికే లొంగిపోతాననుకున్నాడా! ఈ పాటి పొరుగు దొరకకనే పోయిందా మాకు? ఈ మహానగరంలో కొన్ని రకాల ఇబ్బందులు ఉంటే ఉండొచ్చు. రేపీపాటికి మరో మంచి వాటా చూసుకోలేకపోతామా!"

శంకరం చప్పట్లు కొడుతూ అన్నాడు. "శభాష్! తెలిసి తెలిసి ఎలా మోసపోయావు రా నాన్నా!"

"నేనా! మోసపోడమా!"

"కాక! వాళ్ళకి కావలసింది నీ అంతట నువ్వే ఖాళీ చేస్తాననడం! ఇల్లంటే నాలుగు గోడలనేది ముఖ్యమే గాని అందులో ఉండేవాళ్ళు సృష్టించుకునే సుఖశాంతులు అంతకంటె ముఖ్యం. ఇంకా దిగి నెల్లాళ్ళయిందో లేదో నీ సౌఖ్యం మీదే దెబ్బతీసి 'అబ్బ, ఇంకెక్కడికైనా పోదాం బాబూ!' అని నీ చేతే అనిపించింది. నేర్పరితనం అంటే ఆ రాజరత్నానిది. అవున్రా. వెర్రిమొహం వెయ్యకు, వ్యాపార

సీమలో నాగలింగంగాడు 'ఒకే' అనిపించుకున్నాడంటే దాని వెనకనున్న వ్యవహారశైలి అంతా ఆ రాజరత్నందే! ఆవిడ కంటె పొడవులో రెండంగుళాలు తక్కువ ఉండడమే కాదు, తెలివిలో ఎన్ని యోజనాలో వెనకబడి ఉంటాడు ఆ నాగలింగం. అందుకే రామూకి ఆవిడంటే పరమ అసహ్యం. ఎన్ని చెప్పాడో ఆవిడ గురించి."

"నేనేదో నా లోకమేదో గాని ఆవిడెలా ఉందో ఏమిటి ఇన్నాళ్ళయింది. సరిగ్గా చూసైనా ఎరగను. ఏ కఱ్ఱని నిప్పంటే అదే కాల్తుంది."

"అంతటితో ఊరుకుంటే ఫరవాలేదు. పక్కనున్న కఱ్ఱల్ని కూడా అంటిస్తుంది."

"ఎందుకీ అనవసరపు విసుర్లు? ఇంతకీ మా సీతకి ఉండాలి బుద్ధి. ఏమైనా నా మనసు విరిగిపోయింది. ఈ చుట్టుపక్కల ఇక ఉండలేను. నేను తొందరగా ఈ వాటా ఖాళీ చేసే మార్గం చూడు."

"ఎందుకు చూడనూ, వాటా ఖాళీ చేసే మార్గం తప్పకుండా చూస్తాను" అన్నాడు తనలో అనుకున్నట్టు. ఎందుకో గాని పళ్ళు పటపట కొరుకుతూ... ఆ తొందరగా అనేది ఆ వారం చివరిలోనే జరుగుతుందని కలలో అనుకోలేదు నేను. అంతేకాదు. అంతకుమించిన ఆశ్చర్యం మరొకటి జరిగింది.

ఖాళీ చేసే మార్గం వాడు చూసిన మాట నిజమే!

కాని మేం కాదు, అలా చేసింది!

కొత్తగా దిగిన వాటాని ఖాళీ చేసి, ఏడాది ఎడ్వాన్సూ వదులుకుని నాగలింగం దంపతులు, లారీడు సామానుతో అదే వెళ్ళిపోవడం!

"ఇక అట్టే ఆలస్యం చెయ్యక వాడు కోరిక అద్దెకి ఒడంబడి ఆ వాటా కూడా ఆక్రమించండి" అని వేరే శంకరం చెప్పాలా, చేసి చూపించాను కూడా. అక్కడితో ఊరుకుంటాడా, సీత దగ్గరకొచ్చి చిన్న సైజు లెక్చరు ఒకటీ!

"గుట్టుగా చల్లగా కాపురం చేసుకుంటున్న దానివి, సంసారివి, ఆ పోకిరీ దానితో గంటలు గంటలు గడిపేదానివని విన్నా నేన్నమ్మలేదనుకో"

"ఏదో ఇరుగూ పొరుగూ కదా అని రానిచ్చాను, ఏమైందనీ!"

"కొద్దిలో నీకు జైలుప్రాప్తి తప్పింది, అందుకూ"

"అయ్యో అదేమిటి?"

"ఆవిడవన్నీ గిల్టు నగలు... కట్టుకునేవి ఎత్తుకొచ్చిన చీరలు... ఉన్న కాస్తా బ్లాక్ మనీట... ఇంకా నయం మిమ్మల్ని లేపేశారు కాదు. పోన్లే మంచివాళ్ళని ఎప్పుడూ ఆ దేవుడు ఓ కంట కనిపెడతాడమ్మా. నీ మొగుడేమో బొత్తిగా ఇల్లు పట్టించుకోని రకం... ఆ వాటా కూడా తీసుకున్నారు కదా... పిల్లలతో ఎలా నిభాయించుకు వస్తావో ఏమిటో. ఇంతకీ ఆ చూపుల గుఱ్ఱం నీ మొగుణ్ణి నీకు కాకుండా చేసును. అతనూ ఈ మధ్య అదోలా తయారయ్యాడు. మళ్ళీ ఎలా మచ్చిక చేసుకుంటావో

ఏమిటో..." ఎక్కడో ఉన్నట్టు నటిస్తూ అన్నీ వింటున్న నేను ఆ తరవాత వాణ్ణి నిలదీశాను.

"ఏంరా శంకరం, ఏం చేసి వాళ్ళని వెళ్ళగొట్టేవురా?"

"అమ్మయ్య. ఇప్పటికైనా ఆ పుణ్యకార్యం కాస్తా నా చేతి చలవ వల్లే జరిగిందని గుర్తించావు. అదెంత కాదు. చెప్తాను కాని ముందొకటి ప్రామిస్ చెయ్యి."

"ఏమిటిది?"

"ఇక ముందైనా 'నన్ను ముట్టుకోకు నా మాలకాకీ' అనే పద్ధతి మానెయ్యి. కాస్త అటూ ఇటూ గమనించి రాబోయే ఆపద ముందుగానే పసిగట్టి ఎలా ఎదుర్కోవాలో అని ఆలోచిస్తూ ఉండు. ఇదేం సత్యకాలం కాదు. ముక్కూ మొహం తెలీని వాడెవడో నిన్ను ఆదుకోడానికి"

"సర్లే జరిగిందేమిటో చెప్పు"

"చెప్పడానికేముంది. ఎక్కణ్ణుంచో వచ్చి ఏదో మాయోపాయం పన్ని మిమ్మల్నిక్కణ్ణుంచి నడిపిద్దామనే రాజరత్నం దుర్బుద్ధి పసికట్టిందగ్గర్నుంచీ దీనినెలా దెబ్బతీయడమా అని ఆలోచిస్తూనే ఉన్నాను. అది ఉపయోగించిన పద్ధతి ఏమిటీ, నీ చేత స్థానచలనం చేయించాలని పరోక్షంగా నీ పెళ్ళాన్ని వాడుకుంది. అవునా"

"అయితే?"

"ఆ మార్గాన్నే నేనూ అనుసరించాను. 'మహాత్ములు పోవు త్రోవ' అని ఊరికే అన్నారా పెద్దలు? నేను వాళ్ళాయన్ని పావుగా వాడుకున్నాను"

"ఏం చేశావో తొందరగా చెప్పు."

"చెప్పాను కదా, వాళ్ళ బంధువు రాముగాడు నాకు బాగా క్లోజ్ అయ్యాడనీ, కావాలని ఇందాక చెల్లెమ్మ దగ్గర అలా కోశాను గాని రాజరత్నం అగ్నిసాక్షిగా 'అంటుకున్న' బాపతే. ఆ రామూ లింగరాజుగాడి కజిను. దిక్కులేక వీళ్ళ పంచన చేరాడని ఆవిడ నానా చాకిరీ చేయిస్తుందిట.

అదంతా మనకెందుకు గాని ఆ రాజరత్నం ముందు బొత్తిగా పీలగా పొట్టిగా ఉండే నాగలింగం గాడికి సహజంగానే చచ్చేంత ఇన్ఫీయారిటీ కాంప్లెక్సు, పెళ్ళాం మీద అంతో, ఇంతో అనుమాన సంకటమున్నూ. ఆవిడ మీ ఆవిణ్ణి ఇన్ఫ్లూయన్స్ చెయ్యడానికి అస్తమానం మీ వాటాకి వస్తోంది కదా... నేను దానికే మరోలా భాష్యం చెప్పించాను. లోపల చూస్తే సన్నాసి లక్షణాలకి లోపం లేదు గాని పైకి మాత్రం నీది నవమన్మధాకారం కదా! నీ మీద కన్నేసిందని చెప్తే ఎవడు నమ్మడు!"

"ఛ! అంత దారుణానికి ఒడికట్టావా?"

"ఏం చెయ్యను, దారి తీసింది ఆవిడే! పోనీ అక్కడితోనైనా ఆగిందా, చేసిన ఆఖరి ప్రయత్నమేమిటో తెలుసా? చుట్టూ తిరిగి రావడమెందుకని మీ కామన్ గోడలో ఓ కిటికీ ఏర్పాటు చేసింది, 'డైరెక్టుగా మీ ఆవిడతో మాటాడి మరింత తొందరగా మీలో మనస్పర్ధలు పెంచుదామని' రామూ దగ్గర ఆ సమాచారం అందుకని నేను తక్షణం స్పందించాను.

డబ్బున్నవాళ్ళు గనక, ఆడది పిలిపించి మాటాడింది గనక, ఇంటి యజమాని అలాగే ఏర్పాటు చేశాడు. ఆవిడ చెప్పిన బొత్తిగా గాలి ఆడడం లేదనే మిష నమ్మి.

ఆ కిటికీ కొంచెం ఎత్తునే ఏర్పడి, ఆవిడకి మామూలుగానూ, నాగలింగానికి బల్ల వేసుకుంటే గాని అందని స్థితిలోనూ ఉండడమూ, ఆ కాళ్ళకింద వేసుకునే బల్ల అప్పట్లో రిపేరుకి రావడమూ 'కాలం కలసి రావడమంటే ఇదే సుమా!' అనిపించాయి. రామూ సాయంతో మొగుడు ఎక్కడం ఇష్టం లేక ఆ బల్లని ఆవిడే స్వయంగా తన్నేసి విరిచేసిందని అనిపించి లింగరాజు అనుమానం స్థిరం అవడానికి దారి తీసింది.

పెళ్ళాం అస్తమానం ఆ కిటికీ ముందే తచ్చాడ్డం గమనించిన లింగరాజుకి ఇక రుజువు అక్కర్లేక పోయింది. ఎంత పెట్టమారి మగడయినా పెట్ట మనసు మారిపోతే ఊరుకోలేడు కదా!

'కొట్టు దూరమైతే అయింది, కట్టుకున్నది దూరం కాకుండా ఉంటే చాలు 'అనుకుంటూ హుటాహుటిని ఉడాయించాడు!" ఇంతచేసిన ఈ శంకరం గాడికి తిరిగి ఏం చెయ్యగలనో అప్పుడు నేను ఆలోచించడం లేదు. నా దృష్టి అంతా ఏదో మనసులో పెట్టుకొని ఇన్నాళ్ళూ ఏదోలా ప్రవర్తించిన సీతనీ, కొత్తగా లభించిన ప్రైవసీని ఆ రాత్రి ఎలా సొమ్ము చేసుకుందామా అని!

★